క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం


హులికుంటలో మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట గ్రామంలో శనివారం హులికుంట క్రికెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. మొదటి రోజు ఏడు జట్లు తలపడగా అందులో ఇరిగేపల్లి, అగళి, ముత్తేపల్లి, హెచ్‌టీ హళ్లి జట్లు విజయం సాధించాయి. అంతకుముందు గ్రామానికి చెందిన ద్వారకానాథ్ క్రికెట్ కిట్లను అందించారు. జేసీబీ కిట్టియాదవ్ క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. మొదటి బహుమతిగా విన్నర్ జట్టుకు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు రూ.15 వేలు, రెండో బహుమతి రన్నర్ జట్టుకు హులికుంట సర్పంచ్ కరియమ్మ తనయుడు రవికుమార్ రూ.7,500, ట్రోఫీని రొళ్ల మీసేవా చిరంజీవి అందిస్తారని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అగళి: మండల పరిధిలోని పి.బ్యాడిగెర గ్రామానికి చెందిన మహలింగప్ప అనే వ్యక్తి శనివారం కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. అతడి నుంచి 55 రాజా విస్కీ పాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

మడకశిర: పట్టణ పరిధిలోని వజ్రపాళ్యం వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన నాగరాజు 19 కర్ణాటక మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తున్నప్పుడు పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒంటరి మహిళలకు ఆర్డీటీ అండ


మహిళలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్డీటీ డైరెక్టర్ విశాలా ఫెర్రర్

అగళి: ఒంటరి మహిళలకు ఆర్డీటీ అండగా నిలుస్తోందని ఆ సంస్థ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆడిటోరియంలో 68 మంది ఒంటరి మహిళలకు 2 నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమ పిల్లల్ని బాగా చదివించాలని సూచించారు. పిల్లల చదువు, వైద్యం, గృహ నిర్మాణంలో ఆర్డీటీ సాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఒబుళేష్, ఎస్టీఎల్ బాలయ్య, ఆర్డీటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

రొద్దం: మండల పరిధిలోని కోగిర గ్రామంలో రాయలసీమ విద్యావంతుల వేదిక, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నీటి అవగాహన రాయలసీమకు రక్ష పుస్తకాన్ని ఆవిష్కరించారు. జేవీవీ కన్వీనర్ హరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పట్టు రైతు సంఘం అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, కోగిర జయచంద్రరెడ్డి మాట్లాడారు. రాయలసీమ నీటి వాటా కోసం రాయలసీమ రైతాంగం పోరాడాలన్నారు.

వాల్మీకి జాతరకు తరలిరండి


పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి గురుపీఠాధిపతి ప్రసన్నానందపురి స్వామిజీ

పావగడ: దావణగెరె జిల్లా రాజనహళ్లి వాల్మీకి గురుపీఠంలో ఫిబ్రవరి నెల 8, 9 తేదీల్లో 6వ మహర్షి వాల్మీకి జాతర జరగనుంది. జాతరకు వాల్మీకులు పెద్ద ఎత్తున తరలిరావాలని వాల్మీకి గురుపీఠాధిపతి ప్రసన్నానందపురి స్వామిజీ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి జాతర తాలూకా అధ్యక్షుడిగా నారాయణమూర్తిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వాల్మీకి సంఘం రాష్ట్ర స్థాయి అధ్యక్షుడు ఈశ్వరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏఈఈ హనుమంతరాయప్ప, వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాలేగార్ లోకేశ్, నారాయణమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చె.. సంబరాలు తెచ్చె


హిందూపురంలో చెరకు గడలు, పూలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్/మడకశిరరూరల్/అమరాపురం: హిందూపురం, మడకశిర, అమరాపురంలో శనివారం సంక్రాంతి పండుగ నెలకొంది. మూడు రోజుల పాటు జరిగే భోగి, సంక్రాంతి, కనుమ పండుగ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చెరకు గడలు, గెణసు గడ్డలు, వేరుశనగ కాయలు, పూలు, అనప కాయలు, పండ్లు కొనుగోళ్లు జోరుగా సాగాయి. నూతన వస్త్రాల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేయడానికి రకరకాల రంగులు, ముగ్గుపిండిని కొనుగోలు చేశారు. చిన్నారులు గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు.


అమరాపురం: రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు


మడకశిర మార్కెట్‌లో వేరుశనగ కాయలు, గెణసుగడ్డల విక్రయాలు


హిందూపురం అర్బన్: మార్కెట్‌లో అనపకాయల విక్రయం

రైతులకు వరం ఆర్బీకేలు


పలగలపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిలమత్తూరు: రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరంగా మారాయని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలగలపల్లిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులను చంద్రబాబు చిన్నచూపు చూస్తే.. రైతుల కష్టాలు తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచారన్నారు. గిట్టుబాటు ధరలను కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారని వెల్లడించారు. రైతుభరోసా ద్వారా పంటల సాగుకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. రైతులు ఎల్లప్పుడూ సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు టీఎన్ దీపిక, శాంతమ్మ, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సర్పంచ్ బందేపల్లి శంకర్‌రెడ్డి, ఏఓ వంశీకృష్ణ, మండల అగ్రిబోర్డు అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం


సమన్వయకర్త శాంతమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శాంతమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనపై నమ్మకంతో హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు గెలుపే ధ్యేయంగా పని చేయాలని కోరారు. మడకశిర నియోజకవర్గంలో పార్లమెంట్ స్థానానికి భారీ మెజార్టీ రావాలని కోరారు. పార్టీ తరపున ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మరని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. పలు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టీడీపీకి అభ్యర్థులు లేరన్నారు. చంద్రబాబుకు ఇదే చివరి ఎన్నికలు అని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ్, కుంచిటి వక్కలి కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, తమ్మడేపల్లి ఎంపీటీసీ నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వండి


మలసముద్రంలో పథకాలను వివరిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మలసముద్రం, జక్కసముద్రం, పూలచెట్లపల్లి, బూదిలివాండ్లపల్లి , కోరేవాండ్లపల్లి గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి పేదల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పేదల మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యకర్తలు, పార్టీ నాయకుల సేవలను గుర్తించి వారికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, గోరంట్ల ఉపసర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్. జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, నాయకులు బయపరెడ్డి, మలపముద్రం ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణ, అమరనాథరెడ్డి, నార్శింపల్లి శివారెడ్డి, బాబు, గంపల వెంకటరమణారెడ్డి, నాగభూషణరెడ్డి, శంకరనాయక్ పాల్గొన్నారు.

18 నుంచి మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన


మాట్లాడుతున్న మండల కన్వీనర్ నరసింహమూర్తి

పరిగి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఈనెల 18న మండల పర్యటనకు వస్తున్నారన్నారు. ఈనెల 21 వరకూ నాలుగు రోజుల పాటూ మండలంలో పర్యటిస్తారని పేర్కొన్నారు.

షెడ్యూలు ఇలా..

ఈనెల 18న గొల్లపల్లి, బీచిగానిపల్లి, పాత్రగానిపల్లి, వంగలపల్లి, శీగిపల్లి, గణపతిపల్లి, పైడేటి, ఎస్ కొత్తపల్లి, పి నరసాపురం, ముద్దిరెడ్డిపల్లి, బీరేపల్లి, ధనాపురం, శిరేకోళం, 19న బసవనపల్లి, దాసరిపల్లి, ఊటుకూరు, అక్కంపల్లి, ఎర్రగుంట, టీడీపల్లి, విట్టాపల్లి, చిన్నపల్లి, మూడిండ్లపల్లి, హొన్నంపల్లి, నరసాపురం, జంగాలపల్లిలో పర్యటిస్తారు. 20న నేతులపల్లి, శాసనకోట, బాలిరెడ్డిపల్లి, సుబ్బరాయనిపల్లి, కొడిగెనహళ్లి, బిందూనగర్, కాలువపల్లి, పరిగి, బోరెడ్డిపల్లి, 21న పెద్దిరెడ్డిపల్లి, కోనాపురం, పుట్టగూర్లపల్లి, చెర్లోపల్లి, మోదా, బందార్లపల్లి, ఆనందపాళ్యం, గౌరవనహళ్లి, ముల్లమోతుకపల్లి, శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, సింగల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ కన్వీనర్ జయరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


అమరాపురం: పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమరాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునిస్వామి, ఏపీఓ తిప్పన్న సర్పంచులు వాగేష్, గిరిజమ్మ సూచించారు. శనివారం మండలంలోని మద్దనకుంట, అమరాపురం, తమ్మడేపల్లి గ్రామ సచివాలయాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ పనులు, ప్రధానమంత్రి బీమా యోజన తదితర పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకానికి దరఖాస్తు చేసుకునే విధానం, ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం, బిసలమానేపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ మేడకుర్తి హరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అనేక సంక్షేమ పథకాలను అందజేసిందన్నారు. ఈ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్ర, ఈఓఆర్డీ శివన్న, ఏఓ శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర, కిశోర్, ఆశావర్కర్లు, నాయకులు బద్రి, రవితేజ నాగభూషణ, అమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అండగా ఉంటా


వైటీరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: సీఎం జగనన్న కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి మేలు చేశారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. శనివారం మండలంలోని దొడగట్ట, వైటీరెడ్డిపల్లి, డి.రంగాలపురం, డీఆర్ కొట్టాల, రెడ్డిపల్లి, గోనిమేకులపల్లి, పెద్దగువ్వలపల్లి, చిన్నగువ్వలపల్లి, ఆర్ కొట్టాల, ఆర్ మరువపల్లి, పెద్దకోడిపల్లి, పాతర్లపల్లి, పెద్దిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. దొడగట్టలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మీ ఇంటి ఆడపడుచుగా వస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో ఆదరించండి అంటూ కోరారు. వైటీరెడ్డిపల్లిలో మంత్రి మాట్లాడుతూ.. అందరం కలిసికట్టుగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వెంకటాపురంలో కురుబ సంఘం నాయకులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మరుతిరెడ్డి, కలిపి, రొద్దం సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు కురుబ రామాంజినమ్మ, జెట్టి హరితలక్ష్మి, ఎంపీటీసీ బాలాజీ, ముఖ్య నాయకులు అక్కులప్ప, ఎస్ నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, రాజారెడ్డి, ఉజ్జినప్ప, రాజ్‌గోపాల్ రెడ్డి, వినయ్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ సంచాలకుడు దినేష్

రొళ్ల: శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించనున్నట్లు ఆ ట్రస్ట్ కర్ణాటక రాష్ట్రం తుమకూరు, మధుగిరి, పావగడ ప్రాంతీయ సంచాలకులు దినేష్, రాజగోపాల్, మహేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో బ్రహ్మణ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న గాయత్రి దేవి ఆలయ నిర్మాణానికి ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన ట్రస్ట్ తరపున రూ.రెండు లక్షల డీడీని అందజేశారు. ట్రస్ట్ తరపున గ్రామాల్లో శుద్ధజల తాగునీటి ప్లాంట్, పేద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆర్థిక సాయం, మహిళ సంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిబండ ఎంపీడీఓ రామారావు, బ్రహ్మణ సంఘం నాయకుడు రవిభూషణ్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు రామ్‌కుమార్, రామారావు పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ కార్యదర్శిగా నాగభూషణ రెడ్డి

లేపాక్షి: హిందూపురం నియోజకవర్గం రెడ్డి జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శిగా కొండూరు గ్రామానికి చెందిన నాగభూషణరెడ్డి శనివారం ఎంపికయ్యారు. జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్‌రెడ్డి, లేపాక్షి రెడ్డి జేఏసీ అధ్యక్షుడు బోర్ల అంజినరెడ్డి సూచనలతో ఈయన్ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కొటిపి నరసింహారెడ్డి, హిందూపురం పట్టణ అధ్యక్షుడు మదన గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం


పూజల్లో పాల్గొన్న పేట వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీని నియమిస్తూ ఎండోమెంట్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ చైర్మన్‌గా భగీరథ నవీన్, సభ్యులుగా లక్ష్మీదేవి, భారతి, చంద్రమోహన్, గోపాల్, రామ్మూర్తి, రత్నను నియమించారు. శనివారం నూతన కమిటీ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఇన్‌స్పెక్టర్, కార్యనిర్వహణాధికారి సమక్షంలో కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది.

డ్రై ఫ్రూట్స్ అలంకరణలో శనీశ్వరుడు



పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో కొలువుదీరిన శాంత స్వరూపుడు శనీశ్వరస్వామి శనివారం డ్రై ఫ్రూట్స్ అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. శివమొగ్గకు చెందిన శనీశ్వర స్వామి భక్తుడు మోహన్ కుమార్ కుటుంబ సభ్యులు స్వామిని డ్రై ఫ్రూట్స్ అలంకరణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా నవగ్రహాలకు నవనీత అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తైలాభిషేకం, నవగ్రహాల పూజలు నిర్వహించారు.

ఫ్యాన్ల వితరణ

లేపాక్షి: వీరభద్రస్వామి దేవాలయానికి చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీడీ మొరార్జీ యాదవ్ మూడు ఫ్యాన్లు వితరణ చేశారు. శనివారం ఉదయం రూ.5 వేలు విలువచేసే ఫ్యాన్లను దేవదాయ శాఖ సిబ్బందికి అందజేశారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి శనివారం ఓ ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. అన్నదాతల ఇళ్లు సిరులతో నిండాలన్నారు.

ఏఐటీయూసీలో చేరిక

పెనుకొండ: పట్టణంలోని పలువురు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శనివారం ఏఐటీయూసీలో చేరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు వీరిని సాదరంగా ఆహ్వానించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామని ఆంనేయులు తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, వెంకటేష్, మల్లికార్జున, సుధాకరరెడ్డి, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని నేతాజీ నగర్‌కు చెందిన వృద్ధుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వడ్డే పెద్దన్న (75) శనివారం ప్రమదవశాత్తూ చెరువులోకి జారిపడటంతో మృతి చెందాడు. వివరాలు.. పెద్దన్న బహిర్భూమికి మండల కేంద్రంలోని చెరువు వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

సోమందేపల్లి: మండలంలోని నాసన్, బెల్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు దిలీప్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు పెనుకొండ యాక్షన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తున్న నేపథ్యంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, కళ్యాణ్, బాబురెడ్డి, నాగభూషణం, ఆదిమూర్తి, శ్రీకాంత్, బాబు నరసింహమూర్తి, జగదీష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో చికిత్సలు చేస్తున్న వైద్యురాలు

హిందూపురం టౌన్: పట్టణంలోని కొట్నూరు ప్రభుత్వ పాఠశాలలో శనివారం లైఫ్ విక్టరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ మల్లికార్జున, ట్రస్ట్ చైర్మన్ సాల్మన్ రాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సుకన్య ఆధ్వర్యంలో పలువురికి రక్త పరీక్షలు, వైద్య చికిత్సలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. అధిక శాతం ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారని తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల ఆశ్రమం అశ్వర్థప్ప, ట్రస్ట్ సిబ్బంది సుధారాణి, మహిమ రాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.